క్లుప్తంగా

భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ



వల్లంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టుపై మండలంలోని వల్లంపాడు, పాట్టిపాడు గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో రైతులతో ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం భూములు సర్వే చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం భూములు రీసర్వే చేయించుకోవడం వల్ల పొలాల హద్దులు, భూముల వివరాలు పక్కాగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వల్లంపాడు మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ఏర్పాటు చేసిన దృశ్యం

బనగానపల్లె : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ఈఓ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ప్రయోజనాలు



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

ప్యాపిలి: పంట మార్పిడి ద్వారా అధిక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని జలదుర్గం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకే పంట సాగు చేయడం ద్వారా చీడపీడల బాధ అధికమవడతంతో పాటు దిగుబడి పడిపోతుందని చెప్పారు. పంట మార్పిడి చేయడం ద్వారా భూసారం పెరుగుతుందని, చీడపీడల బాధ తొలగి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని చెప్పారు. ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం నరేంద్రనాథ్ రెడ్డి, డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని యాగంటి పల్లె రహదారిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గడివేముల మండలం ముంజునూరు గ్రామానికి చెందిన పెద్దన్న, గోస్పాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన చిన్నకొండన్న మోటార్ సైకిల్‌పై బనగానపల్లె వైపు వస్తుండగా కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో యాగంటిపల్లె వైపు వెళ్తున్న వరికోత మిషన్, మోటార్‌ను ప్రమాదశాత్తు ఢీ కొట్టింది. దీంతో పెద్దన్న, చిన్న కొండన్న తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సహకారంతో వెంటనే చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. పెద్దన్నకు కాలు విరగడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పది పరీక్షా కేంద్రాల తనిఖీ



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఈఓ

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. ప్యాపిలిలోని రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో పరీక్షలు జరుగుతున్న తీరును సమీక్షించారు.

మెట్టుపల్లిలో ముగిసిన దేవర

ప్యాపిలి: మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో బుధవారం గ్రామ దేవర ఘనంగా ముగిసింది. దేవర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన ప్రజలతో గ్రామం కిక్కిరిసింది. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దేవరకు హాజరయ్యారు. గ్రామ దేవతలు పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ ఆలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

మొక్కవోని సంకల్పం



నరికివేసిన చెట్టు చిగురిస్తున్న దృశ్యం

రాఘవరాజు పల్లె సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టును కొద్ది రోజుల క్రితం విద్యుత్ సిబ్బంది తీగలకు తాకుతున్నాయని కొట్టేశారు. అనతి కాలంలోనే ఆచెట్టు మళ్లీ చిగురిస్తూ పచ్చగా తయారవుతుంది. బతకాలనే సంకల్పం,ఎదగాలనే ఆశయం ఉంటే ఎంతటి విపత్కర పరిస్థితులైనా మొక్కవోని దీక్షతో ఎదుర్కొవచ్చని ఈ చెట్టును చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

కొలిమిగుండ్ల

రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాల తొలగింపు



రాఘవరాజుపల్లె సమీపంలో రాళ్ల గుట్టలు తొలగిస్తున్న దృశ్యం

అనంతపురం -అమరావతి 544-డీ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను జేసీబీల సాయంతో తొలగిస్తున్నారు. బెలుం నుంచి కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, అంకిరెడ్డి పల్లె సమీపంలోని జిల్లా సరిహద్దు వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, రాళ్ల గుట్టలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. రోడ్డు చెంతనే రాళ్లను ట్రాక్టర్లలో తీసుకొచ్చి పడేస్తుండేవారు. దీంతో వాహనదారులు ప్రమాదాలు బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. రెండు రోజుల నుంచి జేసీబీలతో రాళ్లు, కంపచెట్లను పక్కకు తొలగింపు పనులు చేపట్టారు. కొన్ని చోట్ల రాళ్లను పూర్తిగా పక్కకు తొలగించేస్తున్నా మరి కొన్ని చోట్ల మాత్రం నామమాత్రంగా చేశారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వేస్టేజ్ రాళ్లను తీసుకొచ్చి రోడ్డు పక్కల వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.

కొలిమిగుండ్ల

కాకికి తిండి కష్టాలు



పొడవాటి ముక్కు కలిగిన కాకి

కాకులు ముక్కుతోనే ఆహారం తీసుకుని కడుపు నింపుకోవడం తెలిసిందే. అయితే కోవెలకుంట్ల శివారులోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ సమీపంలో ఒక కాకికి ఇతర కాకుల మాదిరి కాకుండా పొడవాటి ముక్కు కల్గి ఉంది. అటువైపు వెళ్లే పాదాచారులు వేసవికాలం కావడంతో కాకులకు ధాన్యం గింజలు ఆహారంగా వెదజల్లారు. మిగతా కాకులు ముక్కుతో చకచకా వాటిని తినేశాయి. అయితే పొడవాటి ముక్కు ఉన్న కాకి మాత్రం గింజలు తినేందుకు నోటికి అందక నానా తిప్పలు పడి చివరకు కొన్ని గింజలు మాత్రమే తిన గలిగింది.

కోవెలకుంట్ల

వేసవికాల పంటలకు సబ్సిడీపై విత్తనాలు



క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: వేసవికాలంలో బోర్ల కింద పంటలు సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. బుధవారం మండలంలోని గుళ్లదూర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అపరాల పంటలైన మినుము, పెసర, చిరుధాన్య పంట అయిన కొర్ర విత్తనాలను రైతులకు అందజేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు వర్తింపుకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

ప్యాపిలి: జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం ప్యాపిలికి వచ్చిన ఆయన బోరెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డాడని గుర్తు చేశారు. ఆయన అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. స్టేట్ మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, బోరెడ్డి రాము, రఘు, గోపి, బొజ్జా మల్లికార్జునరెడ్డి, శ్యాం రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బషీర్, కొండయ్య, ప్రభాకర్ రెడ్డి, ఇమాముద్దీన్ ఉన్నారు.



వెంకటస్వామితో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

పరామర్శ

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట స్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి వెంకటస్వామిని పరామర్శించారు. ఆసుపత్రి రిపోర్టులు పరిశీలించి, మెరుగైన వైద్యం కోసం తన వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ బుగ్గన బుగ్గన నాగభూషణం రెడ్డి , వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు నాగేశ్వరరావు, భరణి, పురుషోత్తం, గోపాల్, భీమన్న గారి శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: స్థానిక షాదీఖానాలో రంజాన్ పండుగను పురస్కరించుకొని బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 400 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను మండల ఖాజీ నూర్ అహ్మద్, రాష్ట్ర మాజీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ముర్తుజావలి పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కరీముల్లా, సభ్యులు షేక్షావలి, సద్దాం, సలాం, వలీబాషా, సునీల్ పాల్గొన్నారు. డోన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు పట్టణానికి చెందిన షేక్ ఇమ్రాన్, డోన్ పట్టణానికి చెందిన క్యాంటీన్ షబ్బీర్ 13 నిరుపేద ముస్లిం, హిందూ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకుల కిట్లను బుధవారం పంపిణీ చేశారు. 15 రకాల నిత్యావసర సరుకులతో పాటు కొంత నగదును కూడా అందజేశారు. ద్రోణాచలం సేవా సమితి సభ్యులు ఫోటోగ్రాఫర్ బాబా, ఆటో మధు, షబ్బీర్, తాహెర్‌బాషా, షకీర్ తెలిపారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించాలి

కోవెలకుంట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఆ పథక ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిసిన దృష్ట్యా ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. కూలీలకు సగటు వేతనం రూ. 300 వర్తించేలా పనులు చూపించాలని సూచించారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనులు జరిగే ప్రదేశాల్లో నీడ, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ హరికిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, కొండారెడ్డి, పక్కృద్దీన్‌బాషా, రాధాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

28న డివిజన్ స్థాయి పెన్షనర్ల సమావేశం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె డివిజన్ స్థాయి పెన్షనర్ల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎన్ పక్కీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె శంకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక పొదుపు భవనంలో ఉదయం 9.30 గంటలకు జరిగే సమావేశా నికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిలతో పాటు మరికొందరు అధికారులు, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. డివిజన్‌లో ఉన్న పెన్షనర్లందరు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పిలుపునిచ్చారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్ : స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో బుధవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొనడంతో రామలింగడు,ఖాజా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతలో రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ఒకే రహదారిలో రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దొరపల్లె గ్రామానికి రామలింగడు పట్టణంలో పనుల ఉముగించుకొని సొంతూరికి వెళ్తుండగా పట్టణానికి చెందిన ఖాజా కొత్తపల్లె నుంచి పట్టణం వైపు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరినీ కర్నూలుకు తీసుకెళ్లారు.

అంతర్జాతీయ వెబ్‌నార్‌లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



అంతర్జాతీయ వెబినార్ పాల్గొన్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, అధ్యాపకులు

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత క్షయ వ్యాధి(టుబర్క్యులోసిస్) పై బుధవారం జరిగిన అంతర్జాతీయ వెబ్‌నార్‌లో పాల్గొన్నారు. ఈ వెబ్‌నార్ కార్యక్రమంలో ఇంగ్లాండ్ దేశంలోని ఫెలో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సీఎం సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని టుబర్క్యులోసిస్ వ్యాప్తి నివారణ, చికిత్స విధానాలు, తాజా పరిశోధనలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాబునాథ్, వసుంధర, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

బేతంచెర్ల: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి వైద్యులకు సూచించారు. బుధవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే.. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో అధికారులు సమక్షంలో ప్రజా సమస్యల ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని 'తమ్ముళ్ల' ఆవేదన..

పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఎన్నికల ముందు ఎంతో కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేస్తే, పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తమకు గుర్తింపు లేదని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీనికి తోడు మండల నాయకులు సైతం తమకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

పోషణతో పాటు విద్యనందించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్ బేగం

బేతంచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్యా కేంద్రాలుగా పనిచేయాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం అన్నారు. పోషన్ భీ, పఢాయి భీ కార్యక్రమానికి సంబంధించి మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ, పద్మావతి, అరుణ కుమారి, శోభారాణి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక పద్మావతి వృద్ధాశ్రమంలో కమ్మక్క అనే 80 ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకులతో పాటు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా కోరిక మేరకు ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు మృతదేహాన్ని హిందూ శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. చరణ్‌తేజా రెడ్డితో పాటు రోటరీక్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్, ఆశ్రమ నిర్వాహకురాలు పద్మ సహకారం అందించారని సమితి వ్యవస్థాపకులు షాధిఖానా రాజు తెలిపారు. సభ్యులు తాహెర్ బాషా, సయ్యద్ వలి పాల్గొన్నారు.

అదృష్టం 'వరి'ంచేనా?

- ఎండకారు వరిపైనే రైతన్నల ఆశలు
- మరో నెలరోజుల్లో చేతికందనున్న దిగుబడులు
- వెంటాడుతున్న అకాల వర్ష భయం
- నష్టాలు మిగిల్చిన ఇటీవల కురిసిన వడగండ్ల వర్షం
- ఆందోళనలో అన్నదాత



కోవెలకుంట్ల సమీపంలో పొట్టదశలో ఉన్న వరిపైరు



గుళ్లదూర్తి సమీపంలో ఇటీవల కురిసిన వర్షానికి నేలవాలిన వరి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో వరిసాగుతో నష్టాలు చవిచూసిన రైతులు రబీ సీజన్ (ఎండకారు)వరిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం పైర్లు పొట్ట దశలో ఉండగా.. రైతులను అకాల వర్షాలు భయపెడుతున్నాయి. ధాన్యం చేతికందే సమయంలో వర్షం కొంపముంచుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

లక్ష్యానికి మించి సాగు..

సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో ఈ ఏడాది 2,989 హెక్టార్లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు పరివాహక ప్రాంతాల్లో లక్ష్యానికి మించి 3,557 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల, 555 రకాలకు చెందిన వరి సాగు చేశారు. ప్రస్తుతం పైరు రెండున్నర నెలల దశలో పొట్ట దశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట దిగుబడులు చేతికందనున్నాయి. ఇటీవల సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసి వరి నేలవాలి నష్టం మిగిల్చింది. ధాన్యం చేతికందే తరుణంలో అకాల వర్షం పంటలను దెబ్బతీస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నష్టాలు మిగిల్చిన ఖరీఫ్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు రైతులకు కలిసిరాలేదు. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో 10,037 హెక్టార్లలో రైతులు కర్నూలు, నంద్యాల రకానికి చెందిన వరి సాగు చేశారు. రసాయన ఎరువులు, వరినారు, క్రిమి సంహారక మందులు, కలుపు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35వేల నుంచి రూ. 40 వేలు వెచ్చించారు. కౌలు రైతులు ఎకరాకు ఖరీఫ్‌లో 10 బస్తాలు, రబీలో మూడు బస్తాల వడ్లు చెల్లించేలా వరిమడులను కౌలుకు తీసుకున్నారు. పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు కురవడంతో వరిని దోమపోటు, అగ్గి తెగులు ఆశించడంతో తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. అక్టోబర్ నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు. పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు వెచ్చించగా దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చి రైతులు నష్టాలు చవి చూశారు. దిగుబడులకు తోడు మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే పలికింది. గతేడాది క్వింటా రూ. 2,200 ధర పలకగా ఈ ఏడాది బస్తా రూ. 1,490 అమ్ముకుని నష్టాలు మూటగట్టుకున్నారు.

దిగుబడులపై ఆశలు

ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు ఎండకారు వరి దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. రబీలో సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 725 హెక్టార్లు, సంజామల మండలంలో 203 హెక్టార్లు, అవుకు మండలంలో 1,552 హెక్టార్లు, కొలిమిగుండ్ల మండలంలో 17 హెక్టార్లు, ఉయ్యాలవాడ మండలంలో 761 హెక్టార్లు, దొర్నిపాడు మండలంలో 296 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటి వరకు పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు వెచ్చించారు. వేసవికాలం కావడంతో కొన్ని మండలాల్లో కుందరవాగు, ఎస్సార్బీసీ పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయి. సాగునీరు పుష్కలంగా ఉన్న మండలాల్లో అకాల వర్షభయం వెంటాడుతోంది. ఎలాంటి అడ్డంకులు లేకుండా నెల రోజులపాటు పంటను కాపాడుకుంటే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. సాగునీరందకపోయినా, అకాల వర్షాలు కురిసినా తీవ్ర నష్టాలు చవిచూడాల్సిందేనని వాపోతున్నారు.

25 ఎకరాల్లో వరి సాగు



ఐదు ఎకరాల సొంత పొలంతోపాటు ఎకరాకు 3 బస్తాల వడ్లు కౌలు చెల్లించేలా మరో 20 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొత్తం 25 ఎకరాల్లో వరి సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేలు వెచ్చించాను. మరో నెల రోజుల్లో పంట ఉత్పత్తులు చేతికందుతుతాయి. ఇప్పుడు అకాల వర్షాలు కురిస్తే చేతికందే పంట నేలపాలవుతుంది. దిగుబడులు ఇంట్లో చేరేవరకు వర్షాలు పడకుండా ఉంటే ఈ ఏడాది గట్టెక్కుతాము.

– వెంకటేశ్వర్లు, రైతు, కోవెలకుంట్ల

అకాల వర్షం పడకుంటే దిగుబడులు దక్కుతాయి



గ్రామ సమీపంలోని పాలేరువాగు పరివాహకంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశా. పైరు రెండున్నర నెలల దశలో ఉండగా పెట్టుబడుల రూపంలో ఇప్పటి వరకు ఎకరాకు రూ. 30 వేలు వెచ్చించా. ఇటీవల వడగండ్ల వర్షం కురిసింది. పంట చేతికందే వరకు వర్షం పడకుంటే దిగుబడులు చేతికందుతాయి. అకాల వర్షం కురిస్తే వరిసాగుతో నష్టాలు తప్పవు.

– రాఘవరెడ్డి, రైతు, లింగాల, కోవెలకుంట్ల మండలం